# ముక్తాలత

శ్రీ త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి

రాధ వృషభానుని కూతురు. ఆమె పుట్టిన తరువాత చాల దినముల వరకు కనులు తెరువలేదు. చూడవచ్చినవారందరు ఆమె పుట్టంధురాలు కాబోలనుకొన్నారు.

ఒకనాడు యశోద బాలకృష్ణుని వెంటనిడుకొని రాధను చూడబోయినది. కృష్ణుడు వచ్చి చెంత నిలుచుండినంతనే రాధ నేత్రములు విప్పి ముగ్ధదృష్టితో నతనివంక జూచినది. భూమిమీద జన్మించిన పిదప ప్రప్రథమమున జగన్నాథుడగు శ్రీకృష్ణుని తప్ప అన్యవస్తువు నామె దర్శించదలచుకొనలేదు. అది ఆమె జన్మజన్మాంతరములనుండి నిర్వహించుచున్న ప్రణయ సమయము.

నవనవలాడు గున్నమామిడివలె రాధ అల్లారు ముద్దుగా పెరిగినది. క్రమముగా నామెకు వయసు వచ్చినది. తారుణ్యరేఖ ఉదయించినంతనే వసంత శోభా విలాసిని అయిన ప్రకృతివలె, నవరాగోన్మిషిత అయిన ఉషస్సువలె, శారదజ్యోత్స్నాశోభిత అయిన పూర్ణిమవలె సర్వాంగసుందరియై, లావణ్యలలితయై, జగన్మోహిని అయినది. వృషభాను డామెను యశోదకు సన్నిహితభ్రాత అయిన ఆయానఘోషున కిచ్చి వివాహము చేసినాడు.

వివాహము వివిధోత్సవవిన్యాసములతో వినోదముగా జరిగినది. కళ్యాణమంటపమున కృష్ణుడు రాధను తిలకించినాడు. క్రొత్త సిగ్గులపెండ్లికూతు రగుటచే రాధ కృష్ణుని చూచినదో లేదో.

రాధను చూచినదిమొదలు కృష్ణున కామెమీద అపూర్వానురాగ ముదయించినది. అలౌకికానుబంధ మేర్పడినది. ఆమెను దర్శింపవలెనని ఆకాంక్ష జనించినది. కాని దర్శన మెట్లు? రాధ ఇప్పుడు అంతఃపురాంగన. రాజావరోధము సులభముగా చొరరానిది. మరి తన వాంఛిత మామెకు తెలుపుట యెట్లు? కృష్ణున కేమియు తోచలేదు. అతనికి రానురాను దర్శనేచ్ఛ దుర్వారము కాసాగినది.

సాయంసమయము. అస్తమానసూర్యుడు హిరణ్మయకిరణములతో యమునాకుమారితరంగహస్తములను లాలించుచున్నాడు. అంతరీపమునుండి కదంబశాఖ స్రోతోంగములకు గిలిగింతలు పెట్టుచున్నది. శాఖమీద కూర్చుండి విస్ఫారితనయనములతో, నిర్నిమేష దృష్టులతో కృష్ణు డా రమణీయదృశ్యము వీక్షించుచున్నాడు. ఆ సమయమున విశాఖ వినోదార్థ మచటికి వచ్చినది. వచ్చి మహోజ్వలసూర్యబింబపటమున చిత్రితప్రతిమవలె తేజరిల్లుచున్న శ్రీకృష్ణుని దూరమునుండి తిలకించినది. అతని దివ్యసౌందర్యమునకు ముగ్ధ రాలైనది.

రాధప్రాణసఖి విశాఖ. మరునా డామె శ్రీకృష్ణమూర్తిని పటముపై చిత్రించి ఆనందించుచుండ రాధ అచటికి వచ్చి ఆమూర్తిని దర్శించినది. తోడనే ఆమెకు అననుభూతము, అలౌకికము అయిన భావోద్రేక ముద్భవించినది. అం దామెమనస్సు లయ మొందినది.

కొంతసేపటికి బాహ్యస్మృతి కలిగి, హృదయము కుదురుపడిన తరువాత తన భావము మరుగుపరచి రాధ, "విశాఖా! ఆ ప్రతికృతి ఎవరిదే?" అన్నది.

విశాఖ ఉలికిపడి తిరిగిచూచి తొట్రుపాటుతో, "ఎంత సేపైనది రాధా, నీ విచటికి వచ్చి?" అని అడిగినది.

రాధ—(కృత్రిమచమత్కారస్ఫురణతో) ఆ మూర్తి ఎవరిది?

విశాఖ—ఇది—ఇది—నీవు గుర్తించలేదా?

రాధ—ఎక్కడో ఎన్నడో స్వప్నములో చూచినట్లున్నది. కాని—కాని ఎవరో సరిగా స్ఫురించుట లేదు.

విశాఖ—ఇది శ్రీకృష్ణుని రూపము.

రాధ—(చిరునవ్వుతో) శ్రీకృష్ణుడా! దివ్యసుందరవిగ్రహుని చిత్రించితివి. నీ చిత్రకళానైపుణ్యము శ్లాఘ్యముసుమా!

విశాఖ—ఎగతాళి చేయుచున్నావా, రాధా?

రాధ—లేదు, చెలీ నిజమే పలికితిని.

విశాఖ—అట్లయిన ఇందులో చిత్రకళయు లేదు; నైపుణ్య మంతకన్నను లేదు. అతని దివ్యసౌందర్యమిందులో శతాంశమైనను అంకితము కాలేదు.

రాధ— (నవ్వుచు) అట్లయిన అతిశయోక్తులందు నిపుణత సంపాదించిన ట్లున్నావు!

విశాఖ— అతిశయోక్తులా! చూచినగదా తెలియునది! అంత ఎందుకు? నీ కిప్పుడే రుజువు చేసెదను. సాయంకాల మైనదిగదా! శ్రీకృష్ణుడు యమునాతీరమునకు నేడుకూడ వచ్చియుండును. రమ్ము సౌధోపరిభాగమునకు. నీ కతని నిప్పుడే చూపింతును.

సఖు లిరువురును సౌధముమీదికి వెళ్ళి చీకటి పడునంతవరకు నలువంకల కలయజూచినారు. కృష్ణుడెక్కడను కనిపించలేదు.

నాటినుండి రాధకు శ్రీకృష్ణదర్శనాభిలాష అనుక్షణము విజృంభించ దొడగినది. సఖుల సరసాలాపములపై ఆసక్తి సన్నగిల్లినది. భక్ష్యభోజ్యములం దభిరుచి మందగించినది. మాటలాడుచుండగనే మైమరపు ప్రారంభమైనది. నిర్వ్యాజముగా నామె పచారు చేయుచుండును. ద్వారముకడకు బోయి ఎవరికోసమో ప్రతీక్షించుచున్నట్లు చూచుచుండును. ఒకప్పుడు దీర్ఘనిశ్శ్వాసము విడుచును. ఒకప్పుడు పీతాంబరము ధరించి యోగినివలె నిశ్చలముగా కూర్చుండి ధ్యానించును. ఉన్నట్లుండి చివాలున లేచి నిలుచుండును. ఒకప్పుడు ఉపవసించును. ఒకప్పుడున్మాదితవలె పైటతొలగినను, హారములు జారినను, వేణీబంధ మూడినను గణింపదు. మనోగతము సఖులకు వెల్లడింపదు. సఖు లేదైన ప్రశ్నించినపుడు కన్నులప్పగించి రెప్పవాల్చక వెర్రిచూపుచూచును. ఒకప్పుడు కనుబొమలు ముడిచి విసుగుకొనును.

రాధమనస్సు రంజించుటకై సఖులామెను జలక్రీడకు పురికొల్పినారు. విహారములకు ప్రేరేపించినారు. బువ్వములకు మురిపించినారు. గీతములు పాడినారు. నృత్యములు సలిపినారు. ఎన్ని విధముల ప్రయత్నించినను వా రామెహృదయపరివర్తనము తెలిసికొనలేకపోయినారు.

ఒకనాటి సాయంకాలమున శ్రీకృష్ణుడు విరహవికలీకృత మనస్కుడై ఏమియు పాలుపోక విహారమునకు బయలుదేరి పోయి పోయి యాదృచ్ఛికముగా నొకానొక క్రీడోద్యానము చేరినాడు. అచటి కేళీసరస్తీరమున ఏకాంతప్రదేశమందు దట్టమైన కదంబవృక్షచ్ఛాయలో పుష్పశోభారమణీయమైన లతావితానమున ప్రవేశించి మురళి మ్రోయింప నారంభించినాడు. ఆ వంశీనినాదము—

"రాధా, రాధా, రాధా! నా
రాగరసైకసుధా, రాధా!
నీ లీలలు నా హృదయస్పందము
నా లీలల కీవే యాలంబము!"

అని పలుకుచున్నది.

రాధ శయ్యాగృహమున మంచువంటి పరుపుమీద అర్ధశయానయై కిటికీలోనుండి ఆకాశమువంక చూచుచున్నది. నల్లమబ్బులు సంధ్యారుణాంచలములతో పింజలు పింజలుగా వ్యాపించి యున్నవి. వానిపై ఇంద్రధనుస్సు తోచినది. రాధ తదేకధ్యానముతో నా వృశ్యము పరికించుచున్నది. నీలమేఘములు క్రమముగా కృష్ణరూపము ధరించినవి. ఇంద్రధనుస్సు మయూరపింఛ మైనది. అరుణితాంబుదాంచలములు కుసుమదామము లైనవి.

అట్టి సమయమున మురళీనినాదము మలయానిలతరంగములలో నూగుచువచ్చి రాధకు మృదువుగామధురముగా ప్రాణోత్తేజకముగా వినిపించినది. రాధ యులికిపడినది. ఆమెశరీరము పులకిత మైనది. చిత్తము సముల్లసిత మైనది. చటుకున లేచి యామె సౌధోపరిభాగమునకు పోయి వంశీధ్వని వచ్చు వైపు కలయజూచినది. కడిమినీడలలోని పొదరింటిలో నెమలికన్నులకిరీటముతో అడవిపూలదండలతో నీలమేఘశ్యాముడు గోపకులైకభూషణుడు వదన మోరగా వంచి మురళి మ్రోయించుచున్నాడు. దూరమునుండి రాధ ఆ దివ్యమోహనమూర్తిని కనులార దర్శించినది. అతని వంశీనాదామృతము వీనులార గ్రోలినది. ఆమెనేత్రములనుండి ఆనందాశ్రువులు జాలువార నారంభించినవి. తనువు పరవశ మందినది. హృదయ మా గానస్రవంతిలో నిమగ్న మైనది.

విశాఖ రాధను వనవిహారమునకు పిలువబోయినది. శయ్యాగృహమున రాధ కనబడలేదు. అంతట విశాఖ గృహమంతయు కలయవెదకినది. రాధజాడ తెలియలేదు. విశాఖ ఉద్వేజితయై ఇంచుక తడవాలోచించి మేడమీదికి బోయి చూచినది. అచట రాధ ప్రశాంతభావముతో నిశ్చలముగా కూర్చుండియున్నది. ఆమెలలాటమున నేదియో నూతనతేజోవికాసము పొడకట్టుచున్నది. ముకుళిత నేత్రాంచలములనుండి అరుణితకపోలములమీదుగా ముత్యాల దొంతరలు దొరలుచున్నవి. వంశీగీతము మోహనముగా వినబడుచున్నది. విశాఖ నిశ్శబ్దముగా రాధను సమీపించి ఆమెదృష్టికి నూటిగా చూచినది. దూరమున ఉద్యానవనములో

కదంబచ్ఛాయాలలోని లతానికుంజములో సంధ్యా సువర్ణ పుష్పిత శరీరుడు శ్రీకృష్ణుడు హృదయరంజకముగా మురళి వాయించుచున్నాడు. విశాఖ నయనములు ముగ్ధము లైనవి. హృదయము స్నిగ్ధ మైనది.

ప్రభాకరుడు పశ్చిమాంగనాపరిష్వంగమున కరిగినాడు. కృష్ణుడు మురళి చాలించినాడు. కాని రాధ సమాధినిష్ఠవలె అట్లే యున్నది. మురళీకాకలి ఆమె శ్రవణములం దింకను మ్రోగుచునే యున్నది. ఆమెహృదయ మా మాధుర్యపారవశ్య మనుభవించుచునే యున్నది.

క్రమముగా శోణశోభలు శుష్కించినవి. అష్టమిచంద్రుడు అరవిరినవ్వులు వెలయించుచున్నాడు. అచ్చటచ్చట తారకలు గుమిగూడి గుసగుసలాడ దొడగినవి. అప్పుడు విశాఖ మెల్లగా 'రాధా!' అని పిలిచినది. రాధ యులికిపడి, కనులు విచ్చి చూచినది. విశాఖ మందహాసము చేసినది. రాధ సంభ్రమముతో లతానికుంజమువైపు కడగంటిచూపులు ప్రసరించి చటుకున విశాఖవైపు మోము త్రిప్పినది. విశాఖ ఆమె తత్తరము గ్రహించి అరగంటి చిరునవ్వులతో పరిహాసబాణములు విసరినది. అది కనుగొని గండస్థలములపై కుంకుమశోభలలముకొన రాధ శిరము వంచినది. అది గాంచి విశాఖ, 'రాధా! నీ రహస్యము తెలిసినదిలే' అని నవ్వినది. రాధ తలయెత్తి దీనవదనముతో, తేలిపోవు చూపులతో 'చెలీ!' అన్నది. విశాఖ పరిహాసము మాని సాదరముగా, "ఏమి, రాధా! ఎందు కట్లున్నావు? అంత చేలవైతి వేల? నీ భావము తెలియలేదు. చెప్పు—స్పష్టముగా విప్పి చెప్పు. చెప్పవా? నేను నీ సఖిని కానా? నాకడ నీకు బెరు కెందుకు? చెప్పు." అని గడ్డము పట్టుకొన్నది. రాధ దీర్ఘనిశ్వాసము వదలి గద్గదికతో మెల్లగా, 'శ్రీకృష్ణుడు' అన్నది.

విశాఖ—అవును, శ్రీకృష్ణుడు దివ్యసుందరుడు. అతని మురళీగానము జగన్మోహనము.

రాధ—అంతే కాదు.

విశాఖ—(రాధకనులలో తేరిపార చూచుచు) అతనిని ప్రేమించితివా?

రాధ—(ఆర్ద్రనయనము లించుక మరల్చి) అదియేమో నాకు తెలియదు. అతడు—అతడు నా హృదయము హరించినాడు.

విశాఖ—రాధా! యుక్తాయుక్తములు మరచినట్లున్నావు. నీవు కులాంగనవు. అతడు పరపురుషుడు.

రాధ—పరపురుషుడా? కాదు. అతడు నాకు అత్యంతాత్మీయుడు. నా ఆత్మీయత మనుష్యస్వభావమునకు సంబంధించినది కాదు.

విశాఖ—మరి?

రాధ—నా ఆత్మ అతడు. అతని శరీరము నేను.

విశాఖ—అట్లయిన నీ విపుడు కోరున దేమి?

రాధ—(మౌనము)

విశాఖ—ఇంకను దాచుచున్నావా, రాధా?

రాధ—లేదు, సఖీ! ప్రాణసఖివి నీవు. నీకు తెలుపక నే నేమి చేయగలను? కాని—కాని—

విశాఖ—అబ్బా! ఎందు కంత సందేహము, రాధా? నీ వ్యథ చూచిన నా హృదయము దహించుకొని పోవుచున్నది. త్వరగా చెప్పు.

రాధ—సఖీ—సఖీ—

విశాఖ—భయము లేదు. చెప్పు. నా ప్రాణాలర్పించి యైనను నీ కోరిక నెరవేర్చెదను. చెప్పు.

రాధ—(డగ్గుత్తికతో) చెలీ! • నాకు శ్రీకృష్ణుని దర్శనము కావలెను. అతని సాన్నిధ్యము—అతని సాంగత్యము కావలెను.

విశాఖ—సాంగత్యమా?

రాధ—అవును, చెలీ! అదే నా జన్మసాఫల్యము. ఆ శ్రీకృష్ణుడు నా దైవము. అతని చరణకమలములందు నన్ను నేను సమర్పించుకొనవలెను. అందు కివిగో నా ప్రాణాలు నీ హస్తములందు సమర్పించుచున్నాను.

విశాఖ—(దీర్ఘముగా నాలోచించి నిట్టూర్పు విడచి) సరే. కానున్నది కాకమానదు. లోనికి రమ్ము. అందుకు తగిన యుపాయ మాలోచించెదను.

విశాఖ రాధను మెల్లగా గృహాభ్యంతరమునకు తీసికొని పోయినది.

విశాఖకు గొప్ప చిక్కు వచ్చినది. కృష్ణుని యొద్దకు ఏమిషతో పోవలెను? ఏమని చెప్పవలెను? ఏవిధముగా? కృష్ణునకు రాధమీద ప్రేమ ఉన్నదో లేదో! లేకున్న రాధగతి ఏమి? ఉన్నచో వారిని సమావేశపరచుట ఎట్లు? రాధ రాజకుమారి—అంతఃపురాంగన. పరులకు తెలిసినచో? వృషభానుని చెవిసోకినచో? విశాఖశరీరము కంపించినది. ముఖము వివర్ణమైనది. మరి ఉపాయ మేమి? రాధ ఆమెకు ప్రాణసఖి. ప్రాణాలామె హస్తగతము చేసినది. అందుచేత మిన్నుమన్నైనను, మృత్యుముఖగహ్వరము ప్రవేశించియైనను

రాధఅభీష్టము తీర్చవలసినదే. విశాఖ కర్తవ్యము నిర్ణయించుకొనునప్పటికి తొలికోడి కూసినది. మరునాటి నుండి ఆమె కృష్ణుడు విహరించు తావులు కనిపెట్ట నారంభించినది.

ఒకనాటి సాయంకాలమున యమునాతీర మందలి పొదరిండ్లలో కృష్ణుడు ప్రకృతిసౌందర్యము పరికించుచున్నాడు. మలయానిలములు తరగపడకలు వీడి అలసగమనములతో నరుదెంచుచున్నవి. వాని ఒయ్యారమునకు అలరుచెలువలు విరగబడి నవ్వుచున్నవి. అదే సమయ మనుకొని భ్రమరకుమారులు వెనుకనుండి వచ్చి కుసుమకోమలులతో దాగుడుమూత లాడుచున్నారు. అది చూచి విరికన్నెలు చిగురు జొంపముల చాటునుండి ముసిముసినవ్వులతో ముచ్చటపడుచున్నవి.

విశాఖ కృష్ణుని దూరమునుండి చూచి దూర దూరముగా నతని మార్గ మనుసరించి వచ్చి మెల్లగా నతడున్న పొదరిల్లు సమీపించినది. తరువాత జలము త్రాగు మిషతో ప్రవాహము సమీపించి చేతిలోని పూలబుట్ట నీటిలో జారవిడచి, 'అయ్యో, అయ్యో' అని బిగ్గరగా అరచినది. ఆ కేకకు కృష్ణు డులికిపడి బయటికివచ్చి చూచినాడు. ప్రవాహములో కొట్టుకొనిపోవు పూలబుట్ట నందుకొనుటకై విశాఖ ప్రయత్నించుచున్నది. ఆమె ప్రయత్నించినకొలది ఆ బుట్ట మరింత ప్రవాహములోనికి పోవుచున్నది. కృష్ణుడు గబగబ నచటికి పోయి నీటిలో దిగి, పూలపుటిక అందుకొని విశాఖ కొసగినాడు. విశాఖ కృతజ్ఞతాపూర్వక మందహాసముతో, "మీపుణ్యమున నాకు మరల పూలబుట్ట లభించినది. లేకున్న నేను రిక్తహస్తముతో బోయి నా చెలికి ఆశాభంగము కలిగించవలసి వచ్చెడిది. నమస్కారము" అన్నది.

కృష్ణ—సుందరీ! నీ పలుకు లాప్తవచనముల వలె ఆప్యాయముగా ఉన్నవి. ఒక్కమాట అడుగుదునా?

విశాఖ—సందేహ మక్కరలేదు. అడుగుడు.

కృష్ణ—మీ చెలి ఎవరో తెలిసికొనవచ్చునా?

విశాఖ—(మందహాసముతో) మా చెలియా? రాధ.

కృష్ణ—రాధయా—రాధయా?

విశాఖ—మీరు మా రాధ నెరుగుదురా?

కృష్ణ—ఎరుగుదురా! నన్ను నే నెరిగిన ట్లెరుగుదును.

విశాఖ—ఆమె మీ కేమగును?

కృష్ణ—ఆమెయా—ఆమెయా—! చంపక పుష్పము లన్న మీ చెలి కిష్టమా? వీని నేల ప్రత్యేకముగా తీసికొనిపోవుచున్నావు?

విశాఖ—చంపకము లన్న ఆమెకు చాల ప్రీతి. వీనితో నామె తన హృదయాధినాథు నర్చించునట!

కృష్ణ— హృదయాధినాథుడా?

విశాఖ—అవును.

కృష్ణ—ఎవ రా ధన్యుడు? దేవుడా మానవుడా?

విశాఖ—దేవుడే! మానవరూపములో ఉన్న దేవుడు—దేవతారూపము దాచికొన్న మానవుడు.

కృష్ణ—సుదతీ! నీ చమత్కారము నీ సౌందర్యమునకు వన్నె తెచ్చుచున్నది.

విశాఖ—యథార్థము చమత్కారముగా తోచిన నే నేమి చేయగలను?

కృష్ణ—అట్లయిన ఆ ధన్యు డెవ్వరో తెలిసికొనవచ్చునా?

విశాఖ— చెలుల రహస్యము వెల్లడించుట సఖీ ధర్మము కా దనుకొందును.

కృష్ణ—అంత రహస్యమా?

విశాఖ— అవును. ఆమెతోడి మీ బాంధవ్య మెంత రహస్యమో అంత.

కృష్ణ—మధురభాషిణీ! నీ చతురతాపటిమ నెట్లు బహూకరింపవలెనో తెలియుట లేదు.

విశాఖ —బహూకరించితిరికదా మీ సుహృద్వాక్యములచేత!

కృష్ణ—అట్లయిన నా ధన్యు డెవరో చెప్పు.

విశాఖ—అతడా? చెప్పు మందురా? అతడు మీవలెనే ఉండును. ఆ మెరుగుచామనచాయ, ఆ కలువకన్నులు, ఆ రూపరేఖలు అచ్చముగా మీరే.

కృష్ణ—ఆ రాధ ఇట్టి సఖితో ఎట్లు వేగుచున్నదో!

విశాఖ—మీ రిపుడు వేగుచున్నట్లే!

కృష్ణ—రమణీ! నీ పేరేమి?

విశాఖ—నన్ను విశాఖ అందురు.

కృష్ణ—నీవు విశాఖవు కావు—ద్విశాఖవు సుమా!

విశాఖ—ఎట్లు?

కృష్ణ—ఒక శాఖ రాధమీదను, రెండవది అన్యునిమీదను వేసి నడుమ నున్నవాని నుడికించుచున్నావు.

విశాఖ—మీ హృదయరహస్యము వెల్లడించ లేక మీరే ఉడుకుచున్నారు.

కృష్ణ—విశాఖా! నీవు రాధకు ప్రాణసఖివి కదా!

విశాఖ—అవును. అయితే?

కృష్ణ—నాకును ప్రాణసఖి వై నావు.

విశాఖ—ధన్యురాలను.

కృష్ణ—రాధ నొక్కసారి చూపింపగలవా?

విశాఖ—చూపింతు ననుకొనుడు. అందువలన మీ కేమి ప్రయోజనము?

కృష్ణ—ప్రయోజనమా? చక్షుఃప్రీతి అయినను—

విశాఖ—అందు కింత శ్రమపడ నక్కరలేదు.

కృష్ణ—విశాఖా!

విశాఖ—పొరపాటైన క్షమింపుడు.

కృష్ణ—నా మనస్సు తెలిసికొనలేకున్నావా?

విశాఖ—రాధను ప్రేమించితిరా?

కృష్ణ—నానోట పలికింప నెంచితివా?

విశాఖ—పలికిన నోటి ముత్యాలు రాలును కాబోలు!

కృష్ణ—(నిట్టూర్చి ఊరకుండును.)

విశాఖ—చల్లకు వచ్చి ముంత దాచ నేల? చెప్పుడు.

కృష్ణ—విశాఖా! అది ప్రేమయో ఏమో చెప్పలేను. రాధ—ఆ రాధ నా హృదయము!

విశాఖ—కృష్ణామీరు! ధర్మమూర్తులు. మీరు—

కృష్ణ—నా అనురాగము ధర్మాధర్మములకు అతీత మైనది — అతీంద్రియ మైనది — ఆధ్యాత్మిక మైనది.

విశాఖ—(సంతోషముతో పూలపుటికనుండి చంపకమాల చేతికి దీసికొని) నేడు మా రాధసుకృతము ఫలించినది. కృష్ణా! ఇదిగో మీ ప్రణయిని—మీ రాధ ఈ నా హస్తములతో తన హృదయాధినాథు నర్చించుచున్నది.

ఇట్లనుచు విశాఖ కృష్ణునిపాదములమీద చంపకమాల నుంచినది. కృష్ణుడు మాల తీసి, మెడలో వేసికొని, హృదయమునకు హత్తుకొనుచు, "విశాఖా—విశాఖా! నీ యుపకృతి—" అని ఏదియో చెప్పబోయినాడు. విశాఖ అతని మాట కడ్డువచ్చి, "కృష్ణా! నేను మీకు ప్రాణసఖిని గదా! ఇది సఖీధర్మము. అప్పుడే తారకలు గుసగుసలు సాగించినవి. రేపు జాము ప్రొద్దు పోయినతరువాత ఇచటికి దయచేయుడు. ఇక సెలవా! నమస్కారము" అని వెడలిపోయినది.

కృష్ణుడు హర్షోత్ఫుల్లనయనములతో నామె కనబడునంతవరకు చూచి, తరువాత మురళివాయించుచు బయలు దేరినాడు. ఆ మురళి—

"రాధా, రాధా, రాధా, నా
రాగరసైకసుధా, రాధా!"

అని మధురాతిమధురముగా పలుకుచున్నది.

మరునాడు విశాఖ యమునాతీరమున రహఃప్రదేశమందు లతానికుంజములో రాధాకృష్ణుల సమావేశమునకు తగిన యేర్పాటులు చేసినది. సుగంధద్రవ్యములు, కుసుమదామములు మొదలైనవి సిద్ధపరచినది.

ప్రొద్దుకూకినది. జాముప్రొద్దు పోయినదో లేదో పురవీథులు నిర్జనము లైనవి. సౌధము నిశ్శబ్దమైనది. అపుడు విశాఖ రాధ నలంకరింపబోయినది. రాధ అదివరకు ధరించిన అలంకారములు తీసివేసి దానిమ్మపూవువంటి పట్టుపుట్టము ధరించుచున్నది. అది చూచి విశాఖ ఆశ్చర్యముతో, "ఇదేమి, రాధా! నీకోసము రత్నాభరణములను, పరిమళద్రవ్యములను కొని వచ్చితిని. ఉన్న సొమ్ములే తీసివేసితి వేమి?" అని యడిగినది.

అప్పుడు రాధ అనురాగాంచితదరహాసముతో ని ట్లన్నది: "నా హృదయదేవతాసాన్నిధ్యమున నా సహజరూపమును, నా నిరలంకృతసౌందర్యమును సమర్పింప సమకట్టితిని. విశాఖా! నా కీ కృత్రిమభూషణము లెందుకు? కృష్ణసేవయే నా కరములకు కంకణములు. అతని మధురాలాపములే నా కర్ణములకు భూషణములు. ఆ ప్రేమైకమూర్తిమీది అకలంకానురాగమే నా హృదయమునకు రత్నహారము. అతని పాదస్పర్శచే పవిత్రమైన పరాగమే నా శరీరమునకు మలయజపంకము. అంతేకాని నా కీ రత్నాభరణము లక్కరలేదు. చంపకమాలను నన్నుగా నెంచి హృదయమునకు హత్తుకొన్నా డన్నావుగదా! కనుక ఒక్క చంపకమాలమాత్రము నా మెడలో వేయుము. దాని సుధాస్మృతితో నాకా హృదయము సమలంకృతము గలదు."

రాధపలుకులకు విశాఖ అద్భుతరసమున నోలలాడినది. కొంతసేపైనతరువాత ఆమె, "సఖీ! నీ ప్రణయ మనన్యసామాన్య మైనది. నీవు ధన్యురాలవు! ఇదిగో, ఈ నీలాంబర.మాపాదమస్తకము ముసుగు పెట్టుకొని బయలు దేరుము" అన్నది.

నవనవలాడు పత్రములతో, నవ్వుచున్న పువ్వులతో ముద్దులు మూటగట్టు లతాలతాంగివలె రాధ బయలుదేరినది. క్రొక్కారుమబ్బుల చాటున తత్తరపడు మెరపుకన్నెవలె సాగిపోయినది.

కృష్ణుడు పొదరిల్లు చేరి రాధాగమనము నిరీక్షించుచున్నాడు. గాలికి ఎండుటాకులు మర్మరించిన ఉత్కర్ణు డగుచున్నాడు. పిట్టలు రెక్కలు విదిల్చిన కన్నులు విప్పి చూచుచున్నాడు. పైడికంటుల పలుకుల కులుకుచున్నాడు.

విశాఖ రాధను కృష్ణసన్నిధికి కొనివచ్చినది. రాధాకృష్ణులు — పరస్పరజ్యోతిర్మండితముఖమండలులు అన్యోన్య మాలోకించుకొన్నారు. ఆ యాలోకనములు నిర్నిమేషములు; మాధుర్యమునకు బుగ్గలు; పరమసుఖానుభూతికి పడకటిండ్లు.

కృష్ణుడు ప్రేమోత్కలికతో "రా ధా!" అన్నాడు.

ఆ యమృత సంబోధనమునకు పరవశయై రాధ కృష్ణుని చరణములమీద వ్రాలినది. కృష్ణు డత్యాదరముతో రాధను లేవదీసి హృదయమునకు హత్తుకొన్నాడు. ఆ పరిష్వంగములోని ఆనంద మనుభవైక వేద్యము.

ఈవిధముగా రహస్సన్ని వేశములు కొలదిగా జరిగినవి. సన్నివేశములు జరిగినకొలది ప్రణయినీప్రణయులకు పునస్సమాగమేచ్ఛ అతిశయింప దొడగినది. వారెంత నిగూఢముగా ప్రవర్తించినను రహస్యము దాగలేదు. మొదట పరిజనములో గుసగుసలు బయలుదేరినవి. తరువాత బంధువులలో పరిభాషణము లారంభమైనవి. పిదప గృహములో తర్జనములు ప్రాప్తించినవి. అందుచేనిక సమావేశములు జరుగలేదు.

కొంతకాలము గడచినది. విరహాభరముచే రాధ కృశింప నారంభించినది. క్రమముగా వ్యాధిగ్రస్తురాలైనది. అప్పుడు విశాఖ దీర్ఘముగా నాలోచించి మంచి ఉపాయము పన్నినది.

కృష్ణుడు యోగివేషముతో వచ్చి, రాధను సమీపించి .నాడీపరీక్షకై ఆమెహస్తము గ్రహించినాడు. రాధ అతనివంక తేరపారచూచి, కృష్ణు డని తెలిసికొని సంతోషభరితురాలైనది. ఆమెకరస్పర్శచే కృష్ణుడు పులకితచిత్తుడైనాడు.

ఒకనాడు కృష్ణుడు విరహావిహ్వలుడై యుద్యానములో సంచరించుచుండగా నతనికి మంపుతావులు వెదజల్లు సంపెగపువ్వులు కనిపించినవి. వానిని చూచినంతనే అతనికి పూర్వస్మృతి యంతయు ఒక్కసారి తెరదీసిన ట్లైనది. నాటినుండి అతనికి రాధావిరహాము దుస్సహాము కాదొడగినది. అది గమనించి, విచారించి కృష్ణుని స్నేహితుడు సుబలుడు గొల్లవేసముతో కనుచీకటిసమయమున రాధావిశాఖలు ఏకాంతగోష్ఠిలో నుండగా వారియొద్దకు బోయి యిట్లు నివేదించినాడు: "రాధా! నేటికి మూడుదినములక్రిందట కృష్ణు డుద్యానములో విహరించుచు—చంపకకుసుమములు చూచినాడు. తోడనే నీవు భాసించినావట! అప్పటినుండి 'రాధా, రాధా!' అని ఒకేవిధముగా పలవరించుచున్నాడు. ఇప్పుడు మన స్మృతిలో లేడు. నీ వేమి చేసెదవో! అతని ప్రాణములు నీ చేతిలో నున్నవి."

రాధ ఆర్ద్రనయనములతో, నిస్సహాయతాసూచక దృష్టితో విశాఖవంక చూచుచు నామెవక్షముమీద వ్రాలినది. విశాఖ ఆమెయలకలు దువ్వుచు, చెక్కిళ్లు పుణుకుచు భయము లే దని బుజము తట్టినది. తరువాత నొక్కక్షణములో వారు గోపాంగనావేషములు ధరించి, మధురపానీయకలశములు బుజములం దుంచుకొని సుబలునితో బయలుదేరినారు. సుబలుడు వారిని కృష్ణసన్నిధికి జేర్చినాడు.

రాధ కృష్ణుని తలగడవైపున గూర్చుండి కొంచెముకొంచెముగా పానీయ మందిచ్చినది. విశాఖ తామరాకులు గొనివచ్చి వీచినది. సుబలుడు ప్రక్కన గూర్చుండి మృదువుగా వక్షస్థలము నిమిరినాడు.

కొంతసేపటికి కృష్ణుడు కనులు తెరచినాడు. అతని దృష్టి సుబలునిమీద పడినది. తోడనే యతడు, "సుబలా! ఏదీ నా రాధ—నా హృదయము—నా ప్రాణము ఏదీ ?" అన్నాడు.

అప్పుడు రాధ గద్గదికోద్వేగములతో "ఇదిగో, మీ చరణదాసి. ఇటు నావంక చూడుడు. అట్లు చూచెద రేమి ? నన్ను గుర్తింపలేదా ?" అన్నది.

తోడనే కృష్ణుడు డగ్గుత్తికతో, "రాధా, నా రాధా!" అనుచు కరము లామెకంఠమునకు పెనవేసినాడు. వారి యాలోకనము లొండొంటిలో లీనమైనవి.

ఈవిధముగా రాధాకృష్ణులు వివిధోపాయములతో సమావేశములు కలిగించుకొనుచు ఆనందించుచుండిరి.

*　　*　　*

అతి పరిచయమున గాబోలు రాధకు అవజ్ఞత అంకురించినది. వారు వా రాడిపోసికొను నిందాలాప

ములు చెవులలో గ్రుచ్చుకొన్నవి. బంధువుల నీతి బోధలు చిన్నదనమును చిగురొత్తించినవి. స్నేహితురాండ్ర అపహాసములు అభిమానము నుడికించినవి. వృద్ధుల నిష్ఠురవాక్యములు దుస్సహము లైనవి. అందుచే నామెలో గర్వాతిశయములు తలలెత్తినవి.

నేను రాజకుమారిని, కృష్ణుడు సామాన్యుడు-గోవుల గాచువాడు అని గర్వము. అతని సాంగత్యము ఆత్మగౌరవమునకు హానికరము; అతనికోసము పరితపించుట నింద్యము అని అతిశయము. ఇట్టిభావము లామె హృదయములో చిగిర్చినంతనే అవి కృష్ణుని హృదయమున మెరపులవలె మెరసినవి. అతడు మందహాసము చేసినాడు.

ఒకనాడు రాధ చెలికత్తెలతో యమునాతీరమునకు వచ్చి, సువర్ణముక్తాహారములతో గోవు నలంకరించి పూజించినది. కృష్ణుని స్నేహితుడు సుదాముడు అది చూచినాడు. గోవుమెడలోని ముత్యాలహారమతని కెంతో మనోహరముగా కనిపించినది. పూజ పూర్తికాగానే రాధయు, సఖులును గోవువెంట గృహమునకు బోయిరి. సుదాముడు కృష్ణునియొద్ద కరిగినాడు.

కృష్ణుడు కదంబవృక్షచ్ఛాయలో గోపకుమారులు పరివేష్టించియుండ మురళీగానము చేయుచున్నాడు. సుదాముని జూచి, గాన మాపి, "ఏమి, సుదామా! నీ మొగము చూచిన నేదో యుత్సాహము కనబడుచున్నది. ఏమి విశేషము?" అని అడిగినాడు.

సుదాముడు రాధ యొనర్చిన గోపూజా విశేషము చెప్పి, "కృష్ణా! మనముగూడ గోవులను ముత్యాల దండలతో అలంకరించి గొప్ప యుత్సవము చేయవలెను" అన్నాడు. గోపకుమారు లందరు సంతోషముతో, "ఒక్క గోవును గాదు, గోవుల నన్నిటిని ముత్యాలదండలతో అలంకరించి పెద్ద యుత్సవము చేయవలెను" అన్నారు. కృష్ణుడు ముసిముసినవ్వులు నవ్వినాడు.

కాని ముత్యా లేవి? అన్ని ముత్యా లెక్కడ లభించును? ఉత్సాహోద్రేకములో వారి కా యాలోచనము మనసుకు తగులలేదు. "కృష్ణా, ఉత్సవము, కృష్ణా, ముత్యాలదండలు" అని వారు కృష్ణుని ందరతో పెట్ట నారంభించిరి.

అప్పుడు కృష్ణు డించుక ఆలోచించినట్లు నటించి, సుదాముని బిలిచి యిట్లు చెప్పినాడు: "సుదామా! నీవు రాధవద్దకు బోయి, నే నడిగితినని చెప్పి ఒక్క ముత్యము తీసికొని రమ్ము. ఒక్క ముత్యము చాలును. ఆమె 'యెందు'కని యడిగినచో 'కృష్ణుడు దానిని పాతిపెట్టి, చెట్టు మొలిపించి ముత్యాలు కాయించును' అని చెప్పుము."

ఆ మాటలు విని గోపకుమారులు సంతోషాతిశయముతో, "తొందరగా బోయి తొందరగా రా"అని సుదాముని ప్రోత్సహించినారు.

రాధ సఖీజనముతో సరససల్లాపము లాడుచుండగా, సుదాము డచటికి వెళ్లి కృష్ణుడు చెప్పిన మాటలు చెప్పినాడు. ఆ మాటలకు సఖులు పకృ్కన నవ్వి అతని నెగతాళి పట్టించినారు. అప్పుడు రాధ యిట్లన్నది: "సుదామా! గొల్లవారికి వేపకాయంత వెర్రి యుండు నందురు. అది నీయందును, నీ కృష్ణుని యందును నేడు సార్థక మైనది. వెర్రి వాడా! ముత్యాలు సముద్రములో ముత్తెపుచిప్పలందు పుట్టును గాని చెట్టున కాయవు. ఉద్యానములోని పువ్వము లనుకొంటిరా ఏమి? మీ ఊహ మీ వెర్రికి తగినట్లున్నది. గోవులను ముత్యాల దండలతో అలంకరింప దలచినారా? చాలు, చాలు! గొప్పగొప్ప మహారాజులకే సాధ్యము కాదే! ఇక మీకా? ఎంత వెర్రి గొల్లలు! పో, పో! పోయి మీ కృష్ణునితో చెప్పు-ముత్యాలు చంపకపువ్వులవంటివి కావని. సముద్రములోగాని దొరకని ముత్యాలట, చెట్టున కాయింతురట! ఆహా! ఏమి తెలివి! ఊహాప్రవాహము కొండవాగులాగున పరుగెత్తుచున్నదిసుమా! పో, పో! ఈ సంగతి యెవ్వరికి చెప్పకు. సిగ్గుచేటు!"

సుదాముని మొగము వెలవెల బోయినది. చెలికత్తెల పరిహాసమున కతడు చిన్నబుచ్చుకొన్నాడు. రాధ పెట్టిన చీవాట్లకు తల వంచుకొన్నాడు. ఆశాభంగముతో అవమానముతో, నిర్విణ్ణు డైపోయినాడు.

సుదాముడు కాళ్లీడ్చుకొనుచు బోయి, రాధ చేసిన అవమానమును, ఆమె చెలికత్తె లాడిన అపహాసములను కృష్ణునకు నివేదించినాడు. గోపకుమారులు వెలవెలబారిన మొగము లెత్తి తేలిపోవు చూపులతో కృష్ణునివంక చూచినారు.

కృష్ణుని వదనమున మందస్మితము తాండవించినది. ఆ చిరునవ్వు క్రమముగా ముదిరినకొలది మొగలిపూరేకులందలి ధవళిమవలె అంతరించినది. ఉన్నట్లుండి గంభీరభావ మలముకొన్నది. అధోవదనుడై యతడొకింతతడ వాలోచించినట్లుండి, చటుకున తల

యెత్తి ఉత్సాహోత్తేజముతో, "మిత్రులారా! నిరుత్సాహ మొందకుడు. నే నెట్లో ముత్యము గొనివచ్చెదను. మీ రందరిచటనే వేచియుండుడు" అనుచు లేచి బయలుదేరినాడు.

కృష్ణుడు గృహమున కరిగి, తల్లి యొద్దకు బోయి, "అమ్మా! నా కొక ముత్యము కావలెను. ఒక్క ముత్యము! చిన్న దైనను చాలును" అని యడిగినాడు. యశోద "ఎందుకు నాయనా, ముత్యము? దానితో నేమి చేసెదవు?" అన్నది. కృష్ణుడు, "నాకు కావలెను. ఒక్క ముత్య మిమ్మ" అని ప్రతిమాలినాడు. యశోద, "ఎందుకో చెప్పినగాని ఈయను" అన్నది. కృష్ణుడు మొగ మింత చేసికొని పోబోయినాడు. సహజసంతోషముతో తరంగిత మగుచుండు తనయుని వదనమున విన్నబాటు చూచినంతనే యశోద హృదయము కరగినది. ఒక్క ముత్యముకోసము ముద్దు కొమరుడు దైన్యపడుట చూడలేకపోయినది. తోడనే తన జాక్కాలనుండి ముత్యము తీసి, "ఇంత వెర్రి నాయనను ఎక్కడను జూడలేదు. ఇదిగో ముత్యము" అన్నది. కృష్ణుడు ముందుకు వచ్చి ముత్య మంది కొన్నాడు. ఆతని ముఖము మరల సంతోషముతో వికసించినది. యశోద, "ఉత్త పిచ్చితండ్రి!" అనుచు కుమారుని నుదురు ముద్దాడినది.

కృష్ణుడు మహోత్సాహముతో గొల్లచెలికాండ్ర వద్దకు వచ్చినాడు. అతని ముఖవికాసము చూచి గోపకుమారు లెదురు వచ్చినారు. కృష్ణుడు వారికి ముత్యము చూపించి, వారితో గలసి యమునాతీరమునకు వెళ్లినాడు. అం దొకచోట చిన్న గుంట తీసి అందులో ముత్యము పాతిపెట్టినాడు. కలశముతో జలము గొని వచ్చి పాదుమీద ధారగా పోయుచు—

"హర హర శంకర గిరిజాబంధో!
శివశివ శంభో భూతపతే!
కైలాసాధిప కరుణాసింధో!
జయ నటశేఖర విశ్వపతే!"

అని పాడ నారంభించినాడు. గోపకుమారులు వంత పాడుచు, కృష్ణుని చుట్టి నాట్యము చేయసాగినారు.

అది యేమి చిత్రమో, పాదునుండి క్షణములో తీగెలు బయలుదేరినవి. మరియొక క్షణములో అవి ఆ ప్రదేశ మంతయు అల్లుకొన్నవి. ఇంకొక క్షణములో ఆ లతలకు గుత్తులుగుత్తులుగా ముత్యము లుద్భవించి సూర్యరశ్మిలో వివిధకాంతు లీనదొడగినవి.

గోపకుమారుల సంతోషమునకు మేర లేదు. వారందరు గబగబ ముత్యాలు కోసినారు. దండలు గ్రుచ్చినారు. గోవుల నలంకరించినారు. తమ్ము అలంకరించుకొన్నారు. తరువాత వారు—

"నందకుమారా జయ జయ కృష్ణా!
యశోదాత్మజా జయ జయ కృష్ణా!
మురళీగానవిశారద కృష్ణా!
మౌక్తికసృష్టివినోదా కృష్ణా!
గోపకులైకవిభూషణకృష్ణా!
గోపీహృదయానందన కృష్ణా!
జయజయ కృష్ణా నందతనూజా!
జయజయ కృష్ణా యశోదాత్మజా!"

అని జయధ్వానములు చేయుచు గోవుల నూరేగించినారు.

విశాఖ ఆ యుత్సవము చూచినది. ఆ ముత్యాల తళతళలకు ఆమె కనులు మిరుమిట్లు గొన్నవి. ఆమె మనస్సు ఆశ్చర్యాపహృత మైనది. కృష్ణు డది గ్రహించి చిరునవ్వుతో తల పంకించినాడు.

విశాఖ గృహమున కరిగి, రాధ కా యుత్సవ విశేషములు చెప్పి వానిని చూపించుటకై ఆమెను సౌధోపరిభాగమునకు గొనిపోయినది.

రాధ ఆ మహోత్సవము కనులార తిలకించినది. కాని నమ్మలేకపోయినది. కనులు తుడిచికొని మరల చూచినది. ఆమె నేత్రములు నిర్నిమేషము లైనవి. శరీరము కంటకిత మైనది. ఆమె నిశ్చేష్టురా లైనది.

కొంతసేపటికి తెప్పరిల్లి రాధ పరికించి చూచినది. ఆమెకు శ్రీకృష్ణుడు కనిపించినాడు. అతని వదనమున నేదో యపూర్వజ్యోతి తేజరిల్లుచున్నది. ప్రసన్నతయు, మందహాసమును పొంపిరివోవుచున్నవి. మయూరపింఛము శీవి వెలార్చుచున్నది. రాధ ఉద్రిక్తదృష్టితో అంతయు నుత్ప్రేక్షించినది. ఆమె గర్వము కరిగినది. అహంకార మస్తమించినది. పశ్చాత్తాప మంకురించినది. అపరాధినీభావ ముద్భిన్న మైనది. తోడనే ఆమె కనుకొలకులనుండి బాష్పధారలు జాలువార నారంభించినవి.

అది చూచి విశాఖ, "ఎందుకు, రాధా, కన్నీరు కార్చుచున్నావు?" అని యడిగినది.

రాధ—అపరాధము చేసినాను.

విశాఖ—అపరాధమా ! ఎవరియెడ ?

రాధ—శ్రీకృష్ణునియెడ.

విశాఖ—ఎట్లు ?

రాధ—అజ్ఞానవశమున అతడు గోపాలకు డని తిరస్కరించినాను. అతనితోడి సాంగత్యము అవహేలన చేసినాను. నేను గొప్పదాన నని గర్వించినాను.

విశాఖ—మరి నీవు గొప్పదానవు కావా ?

రాధ—విశాఖా ! ఆ మహానుభావునిముందు నా గొప్పదనము తుచ్ఛ మైనది.

విశాఖ—ఎట్లు ?

రాధ—ఎట్లో తెలియుటలేదా ? అతని వదనము చూడు, దివ్యజ్యోతి ఎట్లు ప్రకాశించుచున్నదో ! ఆ ముత్యములు చూడు, అతని మహిమను వేనోళ్ల చాటుట లేదా !

విశాఖ—నిజమే. అయితే ?

రాధ—(మౌనము)

విశాఖ—ఎందుకు సందేహించుచున్నావు ?

రాధ—విశాఖా ! నన్నతడు మరల ఆదరించునా ?

విశాఖ—నీవన్న ప్రాణాలు విడుచువాడేకదా!

రాధ—అది వెనుకటి సంగతి.

విశాఖ—ఇప్పుడు విశేష మేమి ?

రాధ—ఇప్పుడా—ఇప్పుడు నే నపరాధినిని—దుర్భావనాదూషితను. ఒక్క ముత్యముకోసము సుదామునితో ఎన్ని ప్రలాపము లాడితిని ? వానినిబట్టి నా యహంకార మతనికి వ్యక్తము కాకుండునా ? నా దుర్జనత్వమున కత డెంత నొచ్చుకొన్నాడో !

విశాఖ—నిజమైన ప్రేమకు నొచ్చుకో లుండదు. ప్రేమ ఎప్పుడును బుగ్గవలె ఉబుకుచుండునదేకాని అడ్డంకులకు ఆగిపోవునది కాదు. ప్రేమకు ప్రేమించుటే స్వభావము.

రాధ—నిజమే. ఆ మహాత్ముని ప్రేమ అట్టిదే. సందేహము లేదు. కాని నా ప్రేమ అభిమాన కలుషిత మైనది—అహంకారదూషిత మైనది.

విశాఖ—ఇప్పు డేమి చేయవలె నని నీ సంకల్పము ?

రాధ—విశాఖా ! నా కేమియు పాలుపోవుట లేదు. నా హృదయములో దుస్సహ మైన జ్వాల బయలుదేరినది. ఆ మహనీయుడు నన్ను అనుగ్రహించినగాని అది చల్లారదు. విశాఖా—విశాఖా—.

రాధ కిక నోట మాట పెగలలేదు. ఆమె విశాఖకంఠము కౌగలించుకొని విలపింప నారంభించినది. అపుడు విశాఖ ఆమెచికురములు దువ్వుచు సాదరముగా నిట్లు సముదాయించినది: “రాధా ! ఎందుకంత బేల వయ్యెదవు ? నీ యభీష్ట మేదో తెలుపుము. సాధనీయ మైనచో నే నిప్పుడే నడుము కట్టుకొందును. సందేహింపకుము.”

రాధ—విశాఖా ! మాటిమాటికి నిన్ను కష్టపెట్టుటకు నా మన సొప్పుటలేదు.

విశాఖ—నా కేమి కష్టము, పిచ్చిదానా ! సఖుల కష్టముల కుపకరించుటే సఖీధర్మము. అట్లు ఉపకరించిననాడే నా జీవితము ధన్య మగును.

రాధ—విశాఖా ! ఒక్కసారి ఆ మహనీయుని సన్నిధి కరిగి అతడు నాయెడ ఎట్టిభావముతో నున్నాడో కనుగొని రాగలవా ?

విశాఖ—అ దెంత భాగ్యము, సఖీ ! అందుకు నీ వింత దైన్యపడి అడుగ నక్కరలేదు. కాని అందువల్ల నీ కేమి ప్రయోజనము ?

రాధ—ప్రయోజనమా ? ఆ ప్రణయమూర్తి నాయం దెప్పటట్లు అనుగ్రహముతో నున్నా డని తెలిసినంతనే నా జ్వాల చల్లారి నా హృదయము శాంతించును. నా కంతకన్న నింకేమి ప్రయోజనము కావలెను ?

విశాఖ—అట్లయిన నే నిప్పుడే బయలుదేరెదను. నీవు విచారము మాని సుఖముగా నుండుము.

విశాఖ రాధను గృహములోనికి తీసికొనిపోయి, స్వస్థపరచి తాను కృష్ణునియొద్దకు బయలువెడలినది.

కృష్ణుడు యమునాతీరమున కడిమికొమ్మపై గూర్చుండి మురళి వాయించుచున్నాడు. ఆ మురళి యథారీతి—

“రాధా, రాధా, రాధా ! నా
రాగరసైకసుధా ! రాధా !”

అని పలుకుచున్నది. గోపకుమారు లించుక దూరములో ఉత్సవోత్సాహముతో క్రీడించుచున్నారు. అట్టి సమయమున విశాఖ అచటికి వచ్చినది. ఆమెను చూచి గోపకుమారులు గబగబ ఎదురేగి చుట్టును మూగి ఆమె నిట్లు పరిహసించినారు :

ఒకడు—ఓహో ! విశాఖమ్మగారా ! గొల్లవారివద్దకు దయచేసినా రేమి ?

రెండవవాడు—వెర్రిగొల్లలు ముత్యా లెట్లు సంపాదించినారో చూడవచ్చినది కాబోలు!

మూడవవాడు—ఇవిగోనమ్మా రెండు ముత్యాల దండలు—నీ కొకటి, నీ రాధాదేవి కొకటి.

నాలుగవవాడు—ఒకటి కాదు, పది. ఒక్కొకరికి పది. విశాఖమ్మకు పది దండలు. రాధమ్మకు పది దండలు.

అయిదవవాడు—చెట్టున పుట్టిన ముత్యాలు వారు చేతి ముట్టరు. ముత్యపుచిప్పలలో పుట్టిన ముత్యాలు—మున్నీటిలో మునిగి తీసిన ముత్యాలుగాని వారిని మురిపించవు.

ఆ మాట కందరు గేలిగా చప్పట్లు చరచుచు, పకాపక నవ్వ నారంభించినారు. అపుడు కృష్ణు డచటికి వచ్చి, "మిత్రులారా! మనవద్దకు వచ్చినవారిని పరిహసింపవచ్చునా? అందులో విశాఖ నాకు ప్రాణ సఖి. అందుచేత మీకును సఖియే. ఇక పొండు" అన్నాడు. గోపాలురు మూతులు ముందుకు చాచి ఓరచూపులు చూచుచు ఆవల కరిగినారు.

అపుడు విశాఖ కృష్ణుని సమీపించి, "కృష్ణా! నమస్కారము" అన్నది.

కృష్ణ—నిత్యచమత్కారిణివి కమ్మ.

విశాఖ—చమత్కార మెవ్వరిదో ఈ ముత్యాల దండలే చెప్పుచున్నవి.

కృష్ణ—వాని కేమిగాని, మీ సఖి కుశలమా?

విశాఖ—ఆమె మీ కింకను జ్ఞాపక మున్నదా?

కృష్ణ—ఎందు కట్లనుచున్నావు?

విశాఖ—ఏమో, 'రాధ' అనక 'మీ సఖి' అనుటచేత అట్లన బుద్ధి పుట్టినది.

కృష్ణ—విశాఖా! ఒకవేళ రాధకు నా హృదయము తెలియకపోవచ్చుగాక! నీకు తెలియదా?

విశాఖ—రాధకు తెలియదని ఎందు కనుమానించుచున్నారు?

కృష్ణ—అనుమానించుట లేదు...నీ చమత్కార ధోరణి ఈ క్షణమున నట్టి ఊహ కలిగించినది.

విశాఖ—ఇపుడు మీ మాటలలో చమత్కారమే లేదుసుమా!

కృష్ణ—మరి రాధ నా బహిఃప్రాణమని తెలిసియు నంగనాచివలె 'ఆమె మీ కింకను జ్ఞాపక మున్నదా' అని ఎందు కడిగితివి?

విశాఖ—కోపము వచ్చినదేమో అని.

కృష్ణ—కోప మెందుకు?

విశాఖ—రాధ సుదామునితో విరసములు పలికినందుకు.

కృష్ణ—ఓహో, అదియా! అది యొక శృంగారవిలాస మనుకొన్నాను.

విశాఖ—ముత్యాలు కూడ శృంగారవిలాసమే కాబోలు!

కృష్ణ—నీ వే మనుకొనుచున్నావు?

విశాఖ—నేనా? రాధమీది కోపవిలాస మనుకొన్నాను.

కృష్ణ—ఇంత గడుసుదన మెక్కడ నేర్చితివి, విశాఖా?

విశాఖ—నిజము మాటాడిన గడుసుదన మగునేమి? పోనిండు. ఇప్పుడు చెప్పుడు, రాధ మీకు నిజముగా జ్ఞాపక మున్నదా?

కృష్ణ—విశాఖా! నన్ను నేను మరువగలిగినచో నా రాధను మరచిపోగలను.

విశాఖ—మరచెదరో, మురిసెదరో నాకెందుకు? రాధను తెచ్చి ఇప్పుడే మీముందు నిలబెట్టెదను. అప్పుడామెయే నిర్ణయించుకొనును, మీ కామెమీద నెంత ప్రేమ ఉన్నదో!

కృష్ణ—ఏదీ నా రాధ? ఎక్కడ దాచితివి, విశాఖా? నిన్ను బ్రతిమాలుకొందును, నన్నామె కడకు తీసికొని పొమ్మ. ఆలసింపకుము. అదేమి అట్లు నవ్వెదవు, విశాఖా!

విశాఖ—నే నిప్పుడే గృహమున కరిగి—.

కృష్ణ—అయితే రాధ ఇచటికి రానేలేదా?

విశాఖ—క్షమింపుడు. నేనిప్పుడే వెళ్లి రాధకు సర్వము నివేదించెదను. నమస్కారము.

విశాఖ వెడలిపోయినది. కృష్ణుకు తదేకదృష్టితో నామెవంక చూచినాడు. అతని కనుకొలకులనుండి చమత్కారము తళుకుతళుక్కని తొంగి చూచినది.

విశాఖ గృహమునకు తిరిగివచ్చి రాధకు కృష్ణుని ప్రేమాలాపభంగి సర్వము విశదపరచినది. ఆమెపలుకులు విన్నంతనే రాధకు కనుల నీరు గిర్రున తిరిగినది. అశ్రుబిందువులు జాలువారజొచ్చినవి. కృష్ణదర్శనలాలస వెల్లివిరిసినది. ప్రాణములు కొట్టుకొనదొడగినవి.

దిగంతములందు భయంకరముగా కారుమబ్బులు గ్రమ్మినవి. భీషణముగా విద్యుత్పరంపరలు తాండ

వించినవి. గర్భనిర్భేదకములైన మేఘగర్జలు ధరణీతలము దద్దరిల్ల జేసినవి. ప్రచండవేగముతో ఝంఝూనిలము ప్రకృతి నుగ్రూత లూగించినది. పాషాణవృష్టి ప్రారంభ మైనది.

కొంతసేపటికి ప్రకృతి ప్రశాంత మైనది. ప్రొద్దు గ్రుంకినది. రాకాశశాంకుడు మహోల్లాసముతో గగన మధ్యమున కెగబ్రాకుచు శీతకిరణములు వెదజల్లుచున్నాడు.

రాధ పన్నీట జలకమాడినది. పీతాంబరము ధరించినది. మేలిమిమొగమున కస్తూరీతిలకము తీర్చికొన్నది. తుమ్మెదరెక్కల జల్లిజడలో పారిజాత కుసుమములు తురిమికొన్నది. మామిడిపండుమెడలో సంపెంగదండ అలంకరించుకొన్నది. ఇంకొక సంపెంగ దండ పట్టురుమాలులో పదిలపరచుకొని ప్రయాణ మైనది.

అప్పు డచటికి విశాఖ వచ్చినది. ఆమె రాధావదన మందలి ప్రసన్నతయు, దృష్టులందలి గాంభీర్యమును, శరీరభంగిమలోని యుత్సాహమును గమనించి సంభ్రమాశ్చర్యములతో "ఎక్కడికి, రాధా ?" అని యడిగినది.

రాధ—రాసక్రీడకు.

విశాఖ—రాసక్రీడకా ?

రాధ—అవును.

విశాఖ—ఎవరితో ?

రాధ—శ్రీకృష్ణునితో.

విశాఖ—శ్రీకృష్ణునితోనా ? ఎక్కడ ఉన్నాడని ?

రాధ—యమునాతీరమున.

విశాఖ—ఎవరు చెప్పినారు ?

రాధ—ఆ ప్రణయమూర్తి నీతో పలికిన పలుకులు.

విశాఖ—రాధా ! నీ వైఖరి చూడగా నీ కేదో యున్మాదము కలిగినట్లు కనబడుచున్నది.

రాధ—ఇది ఉన్మాద మైనయెడల యావజ్జీవ మిది యిట్లే యుండునుగాక !

విశాఖ—రాధా !

రాధ—ఏమి, విశాఖా ! ఎందు కట్లు కలవర పడెదవు ?

విశాఖ—ఇప్పు డెంత ప్రొద్దుపోయినదో ఎరుగుదువా ?

రాధ—అర్ధరాత్రము కావచ్చినది. అయినను భయము లేదు.

విశాఖ—వెళ్లక తప్పదా ?

రాధ—తప్పదు. వెళ్లితీరవలసినదే !

విశాఖ—అట్లయిన నేను వెంట వచ్చెదను.

రాధ—అక్కరలేదు. నే నొక్క తెనే వెళ్లెదను.

విశాఖ—మరి నీకు తోడు ?

రాధ—తోడు కేమి కొరత ? అమృతహృదయుడు కుముదబాంధవు డున్నాడు. జగత్ప్రాణుడు మలయానిలు డున్నాడు. ప్రణయస్వరూపిణి ప్రకృతి యున్నది. అన్నిటికన్న ప్రబల మైనది నా హృదయ వేదన ఉన్నది. ఇంక నా కేమి కావలెను ?

విశాఖ—రాధా !

రాధ—ఏమి, విశాఖా ! ఎందు కట్లడలెదవు ?

విశాఖ—కృష్ణునియొద్దకు పోయినందు కిదివరకు జరిగిన శాస్తి జ్ఞాపక మున్నదా ?

రాధ—అదియా నీ భయము, విశాఖా ! అట్టి భీతి నా కావగింజంతైనను లేదు. పరులు నిందింతు రనిగాని, పెద్దలు గద్దింతు రనిగాని, బంధువులు పరిత్యజింతు రనిగాని నా కిసుమంతయు శంక లేదు. ఏమైనను కానిమ్ము ! ఈ కళంకితహృదయము శ్రీకృష్ణచరణ సన్నిధిని అకలంకము చేసికొనవలసినదే !

విశాఖ—రాధా !

సాహసోత్సాహములు తొంగలించు చిరునవ్వుతో విశాఖ నొక్క క్షణము వీక్షించి రాధ బయలు వెడలినది. మానససరోవరమునకు బోవు రాజహంసివలె ప్రయాణించినది. శీతకిరణుడు చల్లని చేతులతో సమాదరించినాడు. మలయపవనుడు మృదుస్పర్శచే ప్రోత్సహించినాడు. ప్రకృతి నిశ్శబ్దముగా దీవించినది.

రాధ యమునాతీరము చేరి చూచినది. ముక్తాలతలు కనబడలేదు. కృష్ణుడు కనిపించలేదు. అంతయు నిస్తబ్ధము. నదీతరంగములుమాత్రము కిలకిలలాడుచున్నవి. రాధ సంభ్రమాశ్చర్యములతో నలుదెసలు పరికించినది. ఒకవైపున దీపమాలికలు దేదీప్యమానముగా ప్రకాశించుచున్నవి. వాని ప్రకాశములో మహాసౌధ మొకటి శోభావిశేషముతో విరాజిల్లుచున్నది. ఆ ప్రదేశ మంతయు రాధకు సుపరిచితమైనదే. అచట నట్టి సౌధ మదివర కెన్నడును ఆమె చూచి యుండలేదు. అది యంతయు నివ్వెరపాటుతో పరికించి రాధ తనకు మతివిభ్రమము కలిగినదేమో నని విత

ర్కించుకొన్నది. ఐంద్రజాలికమేమో అని అనుమానించినది. తన యహంకారోన్మూలనమునకు శ్రీకృష్ణుడు కల్పించిన శిక్షావిలాసమేమో అని ఊహించినది. ఏమైనను అచటికి పోయితీరవలసినదే అని నిశ్చయించుకొన్నది. సౌధముమీదనే దృష్టి నిలిపి ధైర్యముతో బయలుదేరినది.

అడుగడుగునకు ఆశ్చర్య మతిశయింప రాధ సౌధసింహద్వారము చేరినది. ద్వారము నానావిధ రత్నములతో ఉద్దీపించుచున్నది. మణికాంతులు మిరుమిట్లు గొల్పుచున్నవి. ద్వారమందు సువర్ణదండహస్తలగు యువతులు గస్తు తిరుగుచున్నారు. వారి శరీరములు సువర్ణరత్నభూషాలంకృతములు, కౌశేయవిభూషితములు. ఆ యాభరణములును, ఆ పట్టుచీరలును రాజాధిరాజులకు గూడ మతివిభ్రమము కలిగించునవి. వారందరు రాధకన్న ఎంతో సౌందర్యవతులు.

ఆ యపూర్వచిత్రము పర్యాలోకించి రాధ చిత్రార్పిత యైనది. కొంతసేపటికి ధైర్యము తెచ్చికొని ద్వారరక్షికయొద్దకు బోయి, "ఇది యేమి?" అని ప్రశ్నించినది.

రక్షిక—ప్రేమసౌధము.

రాధ—అనగా?

రక్షిక—ప్రేమసౌధమే!

రాధ—ఇంతకుపూర్వ మిది యిచట నున్నట్లు లేదే!

రక్షిక—నీ దృష్టి దానిమీదికి పోలేదు. కాని ఇది సర్వకాలసర్వావస్థలయందును ఉన్నదే!

రాధ కా పలుకులు సరిగా బోధపడలేదు. శిలావిగ్రహమువలె ఆమె అట్లే రెప్పవాల్పక చూచిచూచి, "ఈ సౌధ మెవ్వరిది?" అని యడిగినది.

రక్షిక—ఇది ప్రేమమూర్తి యగు శ్రీకృష్ణునిది.

రాధ—శ్రీకృష్ణునిదా?

రక్షిక—అవును.

రాధ—నిజముగా శ్రీకృష్ణునిదేనా—నా కృష్ణునిదేనా?

రక్షిక—నిజమైన శ్రీకృష్ణానురక్తులకు నా పలుకులందు సందేహము కలుగదు.

రాధ—మన్నించు. నే నా శ్రీకృష్ణదర్శనము కోసమే ఎంతో పరితాపముతో వచ్చితిని. అందు కుపాయము చెప్పి పుణ్యము కట్టుకొనుము.

రక్షిక—నీకా శ్రీకృష్ణదర్శనము? చాలు చాలు! పో, పో. వెర్రిదానవువలె ఉన్నావు! మహాత్ములకు సైతము దుర్లభమైన శ్రీకృష్ణదర్శనము నీకు లభ్య మగునా! పొమ్మ, పొమ్మ.

రాధ—అట్లు కాదు, యువతీ! న న్నడ్డగింపకుము. లోనికి పోనిమ్మ. నన్ను నీ వెరుగవు. నేను అనేకపర్యాయము లా మహనీయుని చరణములు ప్రత్యక్షముగా సేవించియున్నాను. న న్నాయన సాదరముగా అనుగ్రహించియున్నాడు. నా వార్త తెలిసిన ఆయన నాకు తప్పక దర్శన మిచ్చును. నే నాయనకు బహిఃప్రాణమువంటిదానను. తెలియునా?—ఎందు కట్లు జాలిచూపులతో మందహాసము చేసెదవు?

రక్షిక—నీ యజ్ఞానమునకు జాలి కలుగుచున్నది. నవ్వును వచ్చుచున్నది. నిన్ను మే మెరుగుదుము. నీవు రాజకుమారివి. కులగౌరవాతిశయము కలదానవు. నీవు రాధవు. ఎన్నోతడవలు నీవు శ్రీకృష్ణచరణములు సేవించితివి. నిజమే. కాని ఆ లీలామానుషవిగ్రహుని మనుష్యమాత్రునిగా నెంచి సేవించితివి. నీ వాయన నిజస్వరూపము గ్రహింపలేదు.

రాధ—గ్రహింపనిమాట యథార్థము. తెలిసికొనుటకు మార్గము చెప్పుము. నిన్ను బ్రతిమాలుకొందును.

రక్షిక—అట్లయిన వినుము. ఈ ప్రేమసౌధమునకు సప్తప్రాకారము లున్నవి. ప్రతిప్రాకారము వద్దను సువర్ణదండహస్తలగు దివ్యసుందరులు శాంతిరక్షికలుగా నున్నారు. సప్తమప్రాకారములో అమృతసరోవర మున్నది. దానినడుమ సహస్రస్తంభవిభ్రాజిత మగు మాణిక్యసౌధ మున్నది. అదే ప్రేమసౌధము. అందు శ్రీకృష్ణుడు నిజస్వరూపముతో నిరంతరము దివ్యలీలావిహారము సలుపుచుండును. అచటికి చేరగలిగినచో ఆమహాపురుషుని తత్త్వము బోధపడును.

ఆ రక్షిక పలికిన పలుకులలో నొక్క యక్షరము గూడ రాధ కవగతము కాలేదు. అది స్వప్నమో మాయయో తెలియలేదు. ఆమెనేత్రములు విస్ఫారితము లైనవి. హృదయము జడీభూత మైనది. ఆమె దారువిగ్రహమువలె నిలువబడిపోయినది.

కొంతసేపటి కామెకు తెలివి వచ్చినది. తెలివితోబాటు శ్రీకృష్ణదర్శనలాలసత పైకుబికినది. తోడనే దైన్యము వెల్లివిరిసినది. రాధ కరుణాకాతరస్వరముతో ఎలుగెత్తి, "కృష్ణా! నీ చరణదాసిని రక్షించు. కృష్ణా! ఈ దీనురాలిని అనుగ్రహించు" అని విలపించుచు లోనికి జొరబడినది.

రాధ ఒక్కొక్క ద్వారమే దాటి పోయినది. ఒక ద్వారముకన్న నింకొకటి అమూల్యమణిశోభితము. ఒక ద్వారమందున్న రక్షికలకన్న నింకొక ద్వారమందున్న రక్షికలు అత్యంతసౌందర్యవతులు, అపూర్వ రత్నాభరణశోభితలు, దివ్యాంబరాలంకృతలు. ఆ ద్వారములందలి అపూర్వమణిశోభ వీక్షించినప్పుడును, అందలి రక్షికల దివ్యసౌందర్యాదులు తిలకించినప్పుడును రాధ పొందిన విస్మయమునకు పారము లేదు. ఆమెకు తన యాభరణములందును, తన సౌందర్యమందును, తనయందును నికృష్టభావము జనించినది. ఆమెయహంభావ మంతరించినది. కులగౌరవము కూలి పోయినది. తన కింక శ్రీకృష్ణదర్శనము లభ్యము కా దని నిరాశ జనించినది. తోడనే ఆమెకు దుఃఖ మతిశయించినది. ప్రాణములు విహ్వలించినవి. ఇప్పుడామె కొక్కటే వాంఛ, ఒక్కటే వేదన, ఒక్కటే ధ్యానము. అది శ్రీకృష్ణదర్శనము! "కృష్ణా! నీ చరణ దాసిని. రక్షించు. కృష్ణా! దీనురాలను. అనుగ్రహించు" అని ఆర్తనాదము చేయుచు మహాసంరంభముతో రాధ సప్తమప్రాకారద్వారము చేరినది.

ఆ ద్వారమందలి దివ్యమణిశోభ వర్ణనాతీతము. అందలి రక్షికల దివ్యరత్నాభరణములును దివ్యస్వర్ణాంబరములును అనుపమేయములు. వారి దివ్యసౌందర్య మతిలోకము. రాధ స్వప్నదృష్టితో అంతయు అవలోకించినది. ఆమెదుఃఖము, ఆమెవేదన, ఆమెశ్రీకృష్ణదర్శనలాలసత — అన్నియు అంతర్ధాన మైనవి. ఆమె చిత్రితప్రతిమ యైనది.

కొంతసేపటికి రాధకు స్మృతి కలిగినది. అప్పుడామెకు ద్వారములోనుండి అమృతసరోవరము కనిపించినది. దానిచుట్టును దివ్యోద్యానము విరాజిల్లు చున్నది. అందలి వికసితకుసుమములు ఆనందహాసము ప్రకటించుచున్నవి. సరోవరమధ్యమున సహస్రస్తంభ మండిత మగు ప్రేమసౌధము గోచరించినది. ఆ సౌధము దీప్తిమత్సువర్ణమయము, దేదీప్యమాన నవరత్నాంచితము. అందు దివ్యాంగనలు సౌదామినులవలె సంచరించుచున్నారు. సౌధశిఖరములు నక్షత్రములతో సయ్యాట లాడుచున్నవి. మధ్యశిఖరమందలి దివ్యమణిమంటపములో దివ్యాంగనలు పరివేష్టించియుండ హంసతూలికాతల్పమున అర్ధశయానుడై, శ్రీకృష్ణుడు దివ్యమోహనమూర్తియై మురళి మ్రోయించుచున్నాడు. ఆ మురళి వెనుకటివలెనే—

"రాధా, రాధా, రాధా!—నా
రాగరసైకసుధా, రాధా!
నీ లీలలు నా హృదయస్పందము,
నా లీలల కీవే యాలంబము!"

అని అతిమనోహరముగా మ్రోగుచున్నది.

రాధకు లీలగా శ్రీకృష్ణదర్శన మైనది. సన్నగా వంశీగానము వినిపించినది. ప్రాణాలు లేచివచ్చినవి. పట్టరాని సంతోషము కలిగినది. ఎక్కడ లేని సత్తువ వచ్చినది. ఆమె ఒకింతతడవు అద్భుతవిస్ఫారితనేత్రములతో ఆనందపారవశ్యముతో చూచిచూచి, చంపకమాల చేతులతో ఎత్తిపట్టుకొని మహోత్సాహముతో, "కృష్ణా! ఇదిగో నీ చరణదాసి. కృష్ణా! ఇదిగో ఈ దీనురాలు. అనుగ్రహించు" అని కేకరించుచు లోనికి పోబోయినది. ద్వారరక్షికలు సువర్ణదండము లడ్డుపెట్టినారు. రాధ ఉడ్డుగుడుచుకొన్నట్లాగిపోయినది.

రాధ ఇంచుక తెప్పరిల్లి భ్రుకుటితనేత్రములతో చురచుర చూచుచు, "న న్నెందు కడ్డగించుచున్నారు?" అని యడిగినది.

రక్షికలు 'శ్రీకృష్ణాజ్ఞ లే' దన్నట్లు శిరము లూగించినారు.

"మురళీగానము నన్ను పిలుచుచుండుట మీరు గ్రహింపలేదా?" అన్నది రాధ.

రక్షికలు తల లోరగా వంచి 'నీకు శ్రీకృష్ణసాన్నిధ్యమహాభాగ్యమా' అన్నట్లు మందహాసము చేసినారు.

"ఈ సంగతి తెలిసిన శ్రీకృష్ణుడు మిమ్ము క్షమింపడు సుమా!"అన్నది రాధ.

రక్షికలు 'నీవు వట్టి అమాయికురాలవు సుమా' అన్నట్లు కిలకిల నవ్వుచు పరిహసించినారు.

"మిమ్ము బ్రతిమాలుకొందును. నన్ను కృష్ణుని యొద్దకు పోనిండు"అన్నది రాధ.

రక్షికలు 'మే మాజ్ఞాబద్ధుల' మన్నట్లు జాలిగా చూచినారు.

"మీకు వేయి నమస్కారములు చేసెదను. న న్నెట్లైన లోనికి పోనిండు. మీకు బహుపుణ్యముండును"అని వేడికొన్నది రాధ.

ఆర్ద్రనయనములతో తమ అసమర్థత ప్రకటించినారు రక్షికలు.

"పోనిండు. ఈ చంపకమాల గొనిపోయి ఆ ప్రేమమూర్తిపాదపద్మములం దుంచుడు. మీ కడుపున బుట్టి మీ ఋణము తీర్చికొందును"అని వాపోయినది రాధ.

నిర్విణ్ణలై అశ్రుసిక్తనేత్రములు వాల్చినారు రక్షికలు.

రాధ నిలువున నీరైనది. 'నా జన్మమున కిక కృష్ణసేవ లేదా'అని నిస్పృహ జెందినది. 'చివరకు నాగతి ఇట్లైనదా'అని దైన్యపడినది. 'ఇక ఈ జీవిత మెవరికోసము'అని నిర్వేదమందినది. 'హృదయ మార్చు ఈ జ్వాల భరించు టెట్లు'అని కస్తిపడినది. 'మర్మము లెడలించు నీ యాతన ఇక సహింపలేను' అని వాపోవుచు స్వేదదూషితమైన వదనముతో, బాష్ప పంకిలములైన కపోలములతో, జపాశోణములైన నేత్రములతో తీవ్రాతపమునకు వడలి యొరగు లతాలతాంగి వలె ద్వారము ముంగిటి చలువరాలమీద సోలిపోయినది. రక్షికలు కంపమానశరీరములతో కలవరపడినారు.

రాధ ఇంచుక సేదదేరి మెల్లగా తలయెత్తి కృష్ణునిపై దృష్టి సారించి హీనస్వరముతో ఇట్లు దుఃఖింపదొడగినది: "కృష్ణా! హృదయాధినాథా! నన్ను అనుగ్రహించు. అహంకారగర్వితనై, అజ్ఞాన విమూఢనై నిన్ను సామాన్యునిగా భావించితిని. నా యపరాధము క్షమించి నన్ను నీ దివ్యశ్రీచరణ సన్నిధికి చేర్చికొనుము. గృహము వీడి, బంధువులను పరిత్యజించి, ఆప్తుల నతిక్రమించి నీ చరణసేవకై యరుదెంచితిని. నాకు నీ దర్శనభాగ్యము లేకుండ జేయకుము. నన్ను పరిత్యజింపకుము. అబలను, పాపాత్మురాలను, దీనురాలను. నన్ను కనికరింపుము. నీవు కరుణింపకున్న ఈ సంసారము నిస్సారము, ఈ జీవితము నిరర్థకము. సంపదలు వాంఛింపలేదు, భోగము లభిలషింపలేదు, ఐశ్వర్యము లాశింపలేదు. కేవలము నీ ప్రేమయే నే నాకాంక్షించినది. నీ సేవయే నే నర్థించినది. నీ సాన్నిధ్యమే నే నాశించినది. కృష్ణా! దీనబాంధవా! ఈ దౌర్భాగ్యురాలిని అనుగ్రహింపరావా? అంత దయార్ద్రహృదయుడవే! అంత ప్రేమ మూర్తివే! ఈ దాసిపై ఇంత కాఠిన్య మెట్లు వహించితివి? ఎట్లు మరచితివి? ప్రభూ! రాధ నా హృదయ మంటివిగదా! నా రాధ నా బహిః ప్రాణ మంటివిగదా! ఇదిగో నీ రాధ, నీ హృదయము, నీ బహిఃప్రాణము! నీ ప్రేమసౌధముముంగిట నీ దర్శనాకాంక్షిణియై, నీ సేవాలాలసయై, ప్రేమ భిక్షుకియై నీ బహిఃప్రాణ మల్లాడుచున్నది! ఈ తపస్వినిని ఆదరింపవా? ఈ పాపాత్మురాలిని అనుగ్రహింపవా? ఆ ఆదరము, ఆ ప్రేమ ఏమైనవి? కృష్ణా! కరుణాసింధూ! ఇక నా శరీరములో రక్తమంత త్రాణకూడ లేదు. నా హృదయము కుమిలిపోయినది. నా నోట మాట వచ్చుట లేదు. ప్రభూ! ఇక నీ మధురనామమే నాకు శరణము! దీనశరణ్యా! నీ చరణాబ్జములే నాకు తారకము. ఇదిగో నీకు ప్రియమైన ఈ చంపకమాలతోపాటు నా ప్రాణములుకూడ నీ చరణాంబుజములం దర్పించుచున్నాను. కృష్ణా! కృష్ణా! కృష్ణా! రక్షించు."

నిద్రితములైన నేత్రములతో, కీర్ణములైన చికురములతో, శీర్ణమైన శరీరముతో, దీర్ణమైన హృదయముతో రాధ చంపకమాల చేత బట్టుకొని రాళ్లవానకు రాలిపడిన శిరీషకుసుమకోమలివలె చంద్రకాంతశిలలపై వ్రాలినది.

చంద్రుడు వెలవెలబోయి మబ్బుల మాటున దూరినాడు. నక్షత్రములు మిలమిల రెప్పలార్చుచు జలజల హిమాంబుశీకరములు రాల్చినవి. మలయానిలము సనసన నిట్టూర్పులు విడచినది. యమునాతరంగములు సన్నని యెలుగుతో సాంత్వనములు పలికినవి. ప్రకృతి ప్రశాంతముగా రాధను హృదయమునకు హత్తుకొన్నది.

సౌధమణికాంతులు తారాకాంతులలో లీనమైనవి. సౌధప్రాకారము లంధకారవత్సములో జొరబడినవి. ద్వారరక్షికలు ప్రకృతిసౌందర్యములో తిరోహితలైనారు. ప్రేమసౌధము అద్భుతలీలారచనయం దంతర్హితమైనది.

దిక్కులు తెలతెలవారుచున్నవి. తారకలు నవోషస్సులో నక్కుచున్నవి. విహంగకలగానములు ప్రాభాతికవాయుతరంగములం దూగుచున్నవి. ప్రకృతి మొగముమీది మేలిముసుగు మెల్ల మెల్లగా తొలగించుచున్నది. యమునాతరంగగీతికలు మేలుకొలుపులు పాడుచున్నవి.

శ్రీకృష్ణుడు ప్రసన్నవదనముతో యమునా సైకతములందు దొగుచున్న రాధశిరస్సు సాదరముగా లేవనెత్తి తన యుత్సంగమున జేర్చికొన్నాడు. సానురాగముగా ఆమెయలకలు దువ్వినాడు. రాధ మెల్ల మెల్లగా కనుదమ్ములు విప్పి చూచినది. ఆమెకు శ్రీకృష్ణుని దివ్యవదనశ్రీదర్శనమైనది. తోడనే లేచి ఆమె 'కృష్ణా' అనుచు అతని దివ్యాంఘ్రులు కౌగలించుకొన్నది. శ్రీకృష్ణుడు 'నా రాధా' అనుచు ఆమెను సాదరముగా లేవదిసి సప్రేమముగా హృదయమునకు హత్తుకొన్నాడు.